# ఆనందపు లోతులు

నిద్రలేచాడు, ఎప్పటిమాదిరిగా కాకుండా:
ఎంతో హాయిగా, కాటిస్ ఫ్రెష్ గా.

గడియారం ఆరు. ఆశ్చర్యం!

తెలీదు యీవింత ఎట్లా జరిగిందీ. రెండో సినిమా చూచాడు. ఒంటి గంట. ఒక్కడూ నిద్ర. ఎప్పుడూ ఎనిమిదింటికి కాని లేవడు. బద్ధకం, చేసే పని లేదు. ఏపనీ చెయ్య బుద్ధి కాదు.

ఇంకా రెండు గంటలు!

నిద్రరాదు, తేలిపోయింది. పక్క మీద కూర్చోడం అసహ్యం! లేచి?

కాలకృత్యాలు. అత్యవసరం.

చుట్టూ వాతావరణం. ఆనందం, ఆహ్లాదం సంతోషం. తనకోసం, తన సుఖంకోసం!

ఏసంగతీ గుర్తురాదు, అంతా ఏవో ఆలోచన్లు! మనసు ఊరుకోదు; విశ్రాంతి తీసుకోదు. ఉరకలు వేస్తుంది ఎందుకో!

ఏడు! స్నానం అయింది. ఇస్త్రీ దుస్తులు తెల్లగా-సన్నజాజికి మల్లే.

కాఫీ?—వ్యసనానికి బానిస!-హోటలు. బజారు—అది సంతోషంలో నే మునిగి.

బారులు తీర్చిన దుకాణాలు-ఒక దానికీ మరో దానికీ మధ్య చీమ దూరేంత సందు కూడా వుండదు. రకరకాలయినవి. రోజూ చూస్తూనే వున్నాడు. కాని యివాళ రేమిటి? ఏదో కొత్తగా వింతగా ఎక్కువ ఆనందంగా. ప్రపంచపు యిరుసు తిరగడంలో ఎక్కడా నీడలు కనపడవు. అంతా వెలుగు.

కిళ్లీ నములూ—ఎక్కడికి? యింటికి కాదు—దూరంగా. వెనుక నుంచి ఎవరో పిలుపు—చప్పట చరుపు. రాఘవరావు! చదువులో సహాధ్యాయి. బాగా ఆస్తి వుంది. యే వుద్యోగమూ చెయడు. తనలాగే ఉన్న డబ్బు ఖర్చు చేసుకోలేక అవస్థపడుతున్నాడు. ఖులాసా కబుర్లు.

'యీ సినిమా చూచావా?' గోడమీద అంటించిన పోసర్ చూపుతో.

'ఊఁ'

'ఎలా వుంది?'

'రాత్రి—రెండో ఆట చూచాను. బాగుంది, చాలా బాగుందిలే' తను!

'నేను చూడలేదింకా - యివాళ చూదామా?'

'ఎందుకు? నువు చూచిరా - నే చూశాగా!'

'మళ్లీ'

'వొద్దు.'

'బాగుందిగా'-యిట్లాగే ఉత్సాహంగా-

'వెంకట్రత్నం. గుర్తున్నాడూ నీకు?'

'ఎవరు?'

'వెంకట్రత్నం బి.యేలో నా వెనక సీటు. మంచి ఫ్రెండ్ మనకు. పొడుగ్గా, నల్లగా-'

'ఎస్. గుర్తొచ్చింది అవును! యిప్పుడెక్కడ?'

'అదే చెబుతా - యిక్కడే! బ్యాంకు ఏజంట్'

'మంచిపని!'

'నిన్న నే చార్జి పుచ్చుకున్నాడు. నా గెస్టు వాడు. మధ్యాహ్నం భోజనం అయినాక - రా, మాట్లాడుకుందాం. వాడూ నిన్ను గురించి చాలా -'

'ఓ! అంతకన్నానా!' సంతోషం తనకు.

బాంధవ్యాలు అన్నిట్లోకీ స్నేహంగొప్పది. ఆసంబంధాన్ని మించింది మరేమీ కనబడదు - అతనికి. వెంకట్రత్నం, రాజు, రాఘవరావు, తను - నలుగురూ బి. ఏ పట్టా ఒకేసారి

## రామానుజాచార్య

తీసుకున్నారు. వాత్సల్యం, ప్రేమ, అనురాగం హృదయంలో పెల్లుబికి - వెల్లువగా!

అడ్డంవస్తున్న బళ్ళను తప్పించుకుంటూ, ప్రయత్నపూర్వకంగా నడుస్తూ - యేదో తిరుగుతున్నట్లు. విలాసంగా వుంది కాలం - పన్నిన వలలోనిండా చేపల్లాగ!

గుళ్ళోదిగి - ఆడవాళ్ళని కొద్దిగా మగవాళ్ళని పోగుచేసి పురాణాలు చెబుతో - ధవారన, యింకా యేదో అర్చనచేసున్న స్వాములార్ని గురించి, హోటల్లో కాఫీ బాగుండకపోవడాన్ని గురించి, విరహం ఎరగని కన్నెపడుచులను గురించి - యింకా ఏవో అసమయానికి నాలుక చివరకు యేదివస్తే అది - మాట్లాడుకుంటూ - కాలానికి కళ్లెం వేసినట్లు, నడుస్తున్నారు ధీమాగా!

కనపడే ప్రతిదృశ్యం చూస్తూ, యేమవుతే యేమవుతుందోనని కళ్ళప్పగించి. అప్పుడే రోడ్డుమీద జనం విపరీతంగా - హడావడిగా - పరిగెత్తుతున్నట్లు తెల్లవారిందే తడవు, మనుషులకు పన్లు, ఆపన్లలో తీరిక లేకపోయి, ఒకటేకొట్టుకోవటం. విసుగు. అందులోనే వుంది కాబోలు - అమందానందం. బుజాలమీద భారం వేసుకుని తిరుగుతూ.

తన కేమిటి? ఏమీ లేదు. ఒక పనిలేదు. కనిపించిన స్నేహితుల్తో కాలం గడపడం.

రాఘవరావు హటాత్తుగా ఆగి, కొత్తగా వచ్చిన సాహిత్య పత్రిక ఒకటి కొన్నాడు దాని పేరుబాగా పరిచయం తనకు. విషయసూచిక చూస్తున్నాడు. తనకళ్లు మెరిసినై ఆశ్చర్యంతో. నిజమేనా? తనకథ! అచ్చులో తనకథ!

అప్పుడు చెబుతున్నాడు తను, దర్జాగా-స్నేహితుడితో తన కథగురించి—తన అనుభవంగురించి! పదహారణాల సాహిత్య పత్రికలో తన కథ! ఇంతవరకూ తనను యేడిపించుకు తిన్న చిల్లర మల్లర పత్రికలకు శృంగభంగం. తలవొంపులు. సిగ్గుచేటు. బాగా దెబ్బతీశాడు తను. కసి తీర్చుకుందుకు. తనకథ! సాక్షాత్తు తను యే అక్షరం వ్రాస్తే సరీగా దాన్నే అచ్చువేశారు—తన కొక దమ్మిడీ ఖర్చు లేకుండా. చిన్న చిన్న పత్రికలలో పడనిది-ఒక్కసారిగా సాహిత్య పత్రికలో! జన్మలో వుంటుందనుకో లేదు, సాహసమే చేశాడు! ఆనందం పెల్లుబికింది యిప్పుడు. తను ఒక కలం చేత వున్నవాడు ఇక ఊరుకోడు విజృంభిస్తాడు. చవిచూపిస్తాడు దేశానికి. చదువుకున్న వాళ్లకి—తన భాషలో సొంపు, విషయ సౌష్ఠవం.

ఈ ఆనందంలో ఆలోచనలో—యేం చెబుతున్నాడో తెలీదు—రాఘవరావు.

వాడు చెబుతోనే వున్నాడు. వింటే—? అసలీ పత్రిక బాగుంటుంది. మొదటనుంచి కొంటున్నాను నేను. నీది యిదే మొదటి కథ కావును! బాగా చదవాలి దీన్ని. శ్రద్ధగా ఎవరిమీద రాశావో, ఎవరి నెట్లా యేడిపించావో!

తన మొదటి కథ యిదే—కాని యింకా రాస్తాడు ముందు ముందు. వాడికి తెలీదు-కథ ప్రయోజనం ఏమిటో—ఎవర్నో తిడితేనో దుయ్యబడితేనో-అది కథే! తెలీదు వాడికి—అసలు కథలు ఎందుకు రాస్తారో. కథలన్నీ ఎవర్నో తిడుతూనే—మొత్తుతూనే!

ఆనందంలో యేదో మాట్లాడ బుద్ధి అవుతుంది. పెద్ద ఉపన్యాసం. కాని నోరు పెగలదు. కలంచేతిలో వుంటే? కాని—రాఘవ యేమిటో అంటున్నాడు—'వెంకట్రత్నాన్ని ఒక్కడిన్నీ కూర్చోబెట్టి వచ్చా—పదయింక! పోదాం యింటికి? తనుయింటి

# ★ ఆనందపు లోతులు ★

ఎందుకు? తిండికి—హోటలు. అదే బజారు. 'తప్పకుండా వస్తా. ఎటూపోకండి మళ్ళీ ఇద్దరూ. ఓ గంటలో'

ఒంటరిగా—రోడ్డుకు అణిగి మణిగి! పడ యుంది.

పోస్టాఫీసులో యిదే టైంకు ఉత్తరాలు యిస్తారు.

అటువైపు.

ఉత్తరం రాలేదు. ఏదో బుక్—పోస్ట్. తెరుచింపి—అదే సాహిత్య పత్రిక—తన కథ ప్రేమతో అచ్చువేసుకున్న మొదటి గొప్ప పత్రిక! ఎరిగిన వాడెవడో చూశాడు—తనకా పత్రిక రావటం.

'చందా కట్టావా?'

'అవును—' అంతకన్నా యేం అనాలి?

'వెనకటి ఇస్యూలు వున్నాయా?'

'ఊహు, యిదే మొదలు!'

'నువ్వు చదివాక...'

'అట్లాగే!—'

తనకు తెలుసు యీ దేశపు దౌర్భాగ్యం. డబ్బు వున్న వాళ్లు కూడా ఖర్చు చేయరు. పుస్తకాలు కొనరు అసలే. అవ్వి లేకపోతే గడవనివి. ప్రాణం పోయేవి—మాత్రం కొనుక్కుంటారు. జీవితంలో ఒక రకంగా సెటిల్ అయాక యిక విజ్ఞాన వికాసాలు గుర్తురావు. కాని చదవాలనే వుంటుంది, పుస్తకాలు. చదివితే బాగుంటుందనీ బ్రహ్మాండంగా వుంటుందనీ తెలుసును హృదయానికి. డబ్బుపెట్టి ఎవరూ కొనరు. తెలుగువాళ్ళు పత్రికలే కొనరు. వాళ్ల ప్రాణానికి డబ్బే ప్రాణం.

హోటలు వచ్చింది. పుస్తకంమీద ధ్యాస తగ్గించి, ఆలోచనలు మాత్రం తగ్గించలేక పోయి—మడిచి జేబులో పెట్టుకొని—భోజనానికి!...

భోంచేస్తుంటే ఎవరో కనిపించారు. తనబంధువే. దూరం. ఎప్పుడో చూచాడు—చాలకాలం క్రితం. ఆయనే పలకరించాడు. తన కజిన్ బ్రదర్ బావమరిది! యీయన కజిన్ బ్రదర్! తింటున్నసేపూ మాట్లాడుతూనే వున్నాడు. ఏవేవో శుభవార్తలు. ఏదో చుట్టాలను గురించి—ఎవరెక్కడ వున్నారో—యేం చేస్తున్నారో—ఎంతమంది పిల్లల్ని కన్నారో—! ఎవరో తనకు చెల్లెలు వరస అయే పిల్లకు నెల్లో జిల్లో పెళ్లి. మరో అక్కగారు యేదో ఆడపిల్లను పురుడు పోసుకుంది. ఎవరో కోరులో గెలిచారు. గొప్ప ఆ సి. బావమరిది యిటీవల యేదో కమిటీ మెంబరుగా ఎన్నికయ్యాడు. కజిన్ బ్రదర్ తండ్రికి ప్రమోషన్—గెజెటెడ్ రాంక్! అయిదొందల్లో రిటైరు. ఏదో ఊళ్ళో కొత్తగా కాలేజీ పెట్టారు...

అన్నీ సంతోషం కలిగించేవే. కారణం మాత్రం ఆలోచించడు. బంధువును వెంటబెట్టుకుని యింటికి. పదినిమిషాలు దాక. ఆయనకేవో పనులు. ఏపనీలేకుండా పొరుగూరెందుకు? రాత్రికి పడుకుందుకు రమ్మన్నాడు. ఏడింటికి అదేహోటలు. శెలవు.

ఈ సందట్లో మరుపు—వెంకట్రత్నం సంగతి. సరిగ్గా పన్నెండుకు అక్కడికి. రాఘవనిద్ర. రత్నం లేచాడు. వాడిముఖం విప్పారి—తామరాకంత, గోడగడియారానికి పదిరెట్లు! హృదయం అంతకన్నా. ఇద్దరికీ అంతే. తనకు యింకా ఎక్కువ. చాలా ఎక్కువ. పొద్దుట్నించీ యింతే. అన్నీ శుభవర్తమానాలు. అసలు కథ వొక్కటే చాలు.

మాటల్లో వెనకటిరోజులు. గడించిన సుఖాలు—కలవరింతలు! ఆరోజులు మళ్ళీ రావు. అందుకని భయం. కాని ఈరోజు? ఇదిమాత్రం మళ్ళీ వస్తుందా? ఈ ఆనందపు అలలు—?

'ఎందరు పిలలు?'

'ఒకటి ప్లస్ ఒకటి—' అడగబోయే ప్రశ్నకూడా యిపుడే జవాబు. వాడంతే. అప్పుడే రత్నం యిద్దరుపిల్లలతండ్రి. తను?—మొదటి కాన్పు—పుట్టింటికి పంపాడు. నేడో రేపో రావాలి—వుత్తరం—పిల్లో పిల్లడో చెబుతో, వస్తుంది...బారసాలకు వెళ్లాలి. ఆ శుభవార్త కూడా నేడే వస్తుందేమో! అసలు—దానికి సూచనలే యివ్వి కావును. అవవచ్చు. 'రాజెక్కడో తెలుసా?'

—యేం తెలుసు? తనకేం తెలుసు? ఎవడూ ఉత్తరాలు రాయడు. ఎవరికీ తనంటే శ్రద్ధ?...

'కాకినాడలో మాసరు—'

—ఎల్. టీ. అయినాడు, గవర్నమెంట్ స్కూల్లో—'

'ఈరోజుల్లో దాన్నిమించిన ఉద్యోగం. మంచిది వుంటుందంటే నేను నమ్మను.




రోజుకు అయిదుగంటలుపని—దర్జాగా కుర్చీలో కూర్చుని!'

'అవునే—పొరుగింటి పుల్లకూర—' వెటకారం తనకు. కొద్దిగా అసూయ రత్నం ఉద్యోగంమీద. రాజుమీద సానుభూతి. వీడుయేజంటు. పెద్దబ్యాంకుకి. ఏదో బోల్డు కబుర్లు చెబుతాడు.

రత్నం నవ్వు—స్నేహితుడి హాస్యానికి. ఊఁ అర్థంలేదు. రాఘవ లేచాడు. 'ఇప్పుడే కలలోనువ్వు—'

కలలోకూడా వస్తాడుతను, నవ్వు—పగటికలలు! కళ్లు నులుముకుంటూ, హటాత్తుగా—రత్నంతో— 'వీడికథ, అసలు రాగానే చెబుదా మనుకున్నాను, చదువు—పెద్దగా' పత్రిక చూపుతూ వాడు. గొప్పగా తను మందహాసం. రత్నం వింత చూపు. తనకథ—ముగురు బియ్యేలు—అర గంట చదివారు.—సవిమర్శగా. ఒక్కొక్క వాక్యానికి గొప్పపడుతో, అభినందిస్తో.

'బాగా రాశావురా, ఎంతిస్తారు?'

'పాతిక, బహుశ—యేం?'

—అవునన్నాడు తను, అమాత్రం చేయదూ? కథలమీద, సాహిత్యంలో కథలస్థానంమీద. జనసామాన్యంలో కథల ప్రభావంమీద, అభిరుచులమీద—గొప్ప చర్చ. తనకు మంచి ప్రోత్సాహం. 'వేలు' పెట్టికొన్నా లభ్యంకాని ప్రోత్సాహం. తన గొప్పను ఎదటి వాడు పొగడడం-అయాచితంగా. అప్పుడే!

కథలమీద సంపాదనగురించి, పేరు మార్చుకుని కొందరు యేకంగా ఆడవాళ్ళ పేర్లతో రాయడాన్నిగురించి—! అర్థ నారీశ్వర భావం.

ఏదో ఆనందం, ఖుషీ అందర్నీ చుట్టి. ఊహించరు ఎవరూ, ఎందుకో—దాన్లో తేలిపోవడం తప్ప. పుట్టబోయే కొడుకును గురించి-వాడిఆటపాటల్ని గురించి, పోషణ గురించి, లోలోపల ఆలోచన్లు. పైకిమాత్రం మాటలువింటూ—వాళ్ళ కబుర్లకుమత్తు.

ఆనందంలో అలిసిపోయి, ఉత్సాహంలో ఎక్కువ మాట్లాట్టంవల్ల శ్రమ. బడలిక. గడియారం మూడు. కాలం దొర్లించడం బహు తేలిక. ఏదో తిండి అందరికీ కావాలి. యిప్పుడు. టిఫిన్. బయులుదేరారు. ఎక్కడికి? ఒకచోట కాఫీ బాగుండదు—కాని పెసరట్టు దివ్యం. తీపి బాగున్నచోట కారం వికారం. కాఫీలో చింతగింజలు. అన్నీ సరి పడవు అందరికీ. కాని ఎక్కడికేనా వెళ్లాలి గద! కూర్చున్నారు, తిన్నారు, తాగారు, ఆకలి కి మళ్ళీ హెచ్చింది. బిల్లు ఎవరు చెల్లించాలని వాదన.

'మీరు నా గెస్ట్—' అంటాడు రాఘవ. తక్కిన యిద్దరూ ఏదో సమాధానం. చివరకు వాడే యిచ్చాడు. మళ్ళీ యింటికి.

నిమిషం నోరుమూతపడదు. పడకూడదు, పడితే అమూల్య క్షణాలు ఎట్లా అవటం? తనకది పర్వదినం. మళ్లారాదు ఎన్నడూ. వొస్తుందని తనకు నమ్మకం సున్న. ఏ దేవుడినో ప్రార్థించి సాక్షాత్కారం చేసుకున్నాడు. వరం సంపాయించాడు, ఒకరోజు సుఖానికి. మళ్లీ మాటలు. అయిదు వరకూ యిట్లానే. అదేసాయిలో. అదే ఆనందంలో. అంగీకరించారు దేవుళు.

అయిదున్నర .. ఆరు !

సినిమాకి. రావని ఎటూ? మిత్రు లిద్దరూ అంటూంటే. ఎవరి ఖర్చుమీదో సినిమాకు. చూచిందే నిన్నరాత్రి. తిరిగీ చూడటం. చూస్తున్నంతసేపూ గర్వం. ముందేం జరుగనుందో తన కొక్కడికే తెలుసు. అది గర్వం. విశిష్టత. నిన్న తను చూచినా, యివాళ చూస్తున్నందుకు.

బాగుంటుంది. అసలు సినిమాలే బాగుండుకు. ఆనందం యిచ్చేందుకు.

హాలు వదిలి రోడ్డుమీదికి. హోటలు. భోజనం ముగుస్తూ.

ఇంటికి. వీధి మలుపు వచ్చింది. తను వెళ్తానన్నాడు. 'యేం, ముగ్గురం, అక్కడే - కబుర్లు చెప్పుకుంటూ—నిద్ర—'

'కాదు యింటిదగ్గరే పడుకోవాలి. అసలే రోజులు—వెధవ్వి!' చెప్పాడు యింకా యేవో కారణాలు - తను యింటికి వెళ్లటానికి. ఇల్లు చూడాలని ఎందుకో ఆదుర్దా. బెంగ యింటిమీద.

స్నేహితుల దగ్గర సెలవు. మళ్లీ రేపు పొద్దునే కలుస్తాడు.

పదిన్నర దాటింది. ఇల్లు వచ్చింది. ఇంటి గుమ్మందగ్గిర ఎవరో...

'ఎవరు-?' తాళం చెవికోసరం జేబులో చెయ్యిపెట్టి-

'బావా, సినిమాకు వెళ్లావా యేం?...'

బావమరిది గొంతు. ఏడుపు. ఏమిటి ... ఎందుకు?

'ఏం చెప్పను బావా...'

ఏం మునిగింది? చెప్పడేం? చెప్పలేడేం? ఏదో అనుమానాలు తనకు. 'పురుడు వచ్చింది. ఇవాళ సాయంకాలం పిల్లా, మా చెల్లెలూ యిద్దరూ యీలోకాన్ని వదిలి...'

ఏం వింటున్నాడు తను?

ఉదయం లగాయితు అనుభవించిన అనవసర ఆనందానికి పరిహారం?

కాలం గంటలు - పదకొండు.

తలుపుతాళం తీయనేలేదు. ఏదో నిమిషానికలా రైలుబండిలో—యిద్దరూ. ★



సుఖజీవితసేవ

భారత "సిద్ధవైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠరోగనివారిణి భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి-మేహరోగ నివారణ సూక్ష, లేహ్యము.

డా॥ కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22, మేల్ మాయిల్. (P. O.) (N. A. Dt.) S. India.

రవి టాయిలెట్స్ అందమును, వర్చస్సును

రవి గ్లిసరిన్ సోప్:—అన్ని కాలముల్లో ముఖ్యంగా వేసవికాలములో వాడదగినది. శరీరమునుమృదువుగను, కాంతిగనుఉంచును

రవి వెజిటబుల్ హేరాయిల్:- శిరోజములను విస్తారంగా పెంపొందించును. దానిచక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.

రవి స్నో:-ముఖవర్చస్సును కాపాడి, విలాసమును పెంపొందించును. సోల్ ఏజెంట్లు:-

ది న్యూస్టార్ & కంపెని,

10, విద్యానాథ మొదలివీధి, మద్రాసు-21.